క్లుప్తంగా

ప్రసాద్ చేస్తున్న కృషి అజరామరం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న అంబికా రాజా, కేవీ సత్యనారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి తానా పూర్వాధ్యక్షుడు, ప్రస్తుత తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమని స్నేహం అసోసియేషన్ అధ్యక్షుడు అంబికా రాజా, కళారత్న కేవీ సత్యనారాయణ అన్నారు. వ్యక్తిగత పనులపై ఏలూరుకు విచ్చేసిన తోటకూర ప్రసాద్ బుధవారం స్థానిక అంబికా భవన్‌లో అంబికా రాజా కార్యాలయాన్ని సందర్శించారు. భారతదేశం నుంచి అమెరికా వెళ్లే ఎంతోమంది కళాకారులకు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఎంతో ప్రోత్సాహమిస్తున్నారని రాజా కొనియాడారు. తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినా తెలుగు ప్రజలు తమ మూలాలను మరచిపోరని, తెలుగు సంప్రదాయ పండుగలన్నీ ఎంతో వేడుకగా కుటుంబ సభ్యుల మధ్య చేసుకుంటూ విదేశాల్లో సైతం తెలుగు సంస్కృతిని పట్టం కడుతున్నారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను అంబికా రాజా స్నేహం అసోసియేషన్ తరఫున దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేయగా, కేవీ సత్యనారాయణ నూతన వస్త్రాలతో సత్కరించారు. గురు శర్మ తెలుగు సాహిత్య పుస్తకాలను బహూకరించారు.

కోడి పందేలు, పేకాటలతో నష్టం



కొమడవోలులో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: సంక్రాంతి సమయంలో కోడి పందాలు, పేకాట, గుండాట తదితర అసాంఘిక కార్యక్రమాల నుంచి గ్రామీణ ప్రజలు దూరం కావాలని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. బుధవారం కొమడవోలు కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంతోషంగా పిల్లాపాపలతో సంక్రాంతి పండుగ చేసుకోవాల్సిన సమయంలో కోడి పందేలు, పేకాటలు ఆడి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. కోడి పందేలు, పేకాట నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు



శనివారపుపేట జెడ్పీ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న బాలికలు



పోణంగిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు

ఏలూరు రూరల్ : జెడ్పీ పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శనివారపుపేట జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం ఎ.సర్వేశ్వరావు ఆధ్వర్యంలో బాలబాలికలు గ్రామీణ ప్రజల సంప్రదాయ పంచెకట్టు, ఓణీలు ధరించి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గాలి పటాలు ఎగరేశా రు. పోణంగి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కందుల రాంబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాల బాలికలకు గాలిపటాలు ఎగరేయడం, బొంగరాలు తిప్పడం, తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఏలూరు లయన్స్ క్లబ్ స్మార్ట్‌సిటీ యాక్షన్ చైర్మన్ జీఎంజీఆర్ కృష్ణారావు, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి షేక్ ముస్తాఫాఅలీ, కె.దేవీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో..

ఏలూరు(మెట్రో): ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్, ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ ఉద్యోగులు, మహిళా ఉద్యోగినులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. హరిదాసు, గంగిరెద్దుల వారి మాటలు, పాటలతో, చిన్న పిల్లలకి భోగి పండ్లు తో, కోలాహలంగా సాగింది. భోగి మంటలు ఏర్పాటు చేసి చుట్టూ పిల్లలుతో కోలాటాలు వేసి, గాలి పటాలు ఎగుర వేసి, సంక్రాంతి పండుగను ముందుగానే తీసుకొచ్చారని వక్తలు కొనియాడారు. అనంతరం హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగర్స్ అర్జున్, సూర్యప్రకాష్, శ్రావణి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ రూపేష్ వర్మ, త్రిపుర ప్రియదర్శిని పాటలతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ కనుగుల శ్రీనివాస్, నీరు ప్రగతి ఎస్‌ఈ బి.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ దేవప్రకాష్, పే అకౌంట్స్ ఆఫీసర్ నరేష్ కుమార్, జిల్లా ఎన్జీఓ సంఘం కార్యదర్శి నెరుసు రామారావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ హైస్కూల్‌లో..



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శ్రీశ్రీ హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో పాటు సంక్రాంతి సంస్కృతి వెల్లివిరిసేలా హరిదాసుల వేషాలు, పల్లెపడుచుల వేషాలు వేసి రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం భోగి మంటలు, పొంగలి పొంగులు, సంప్రదాయ పిండివంటలు, డూడూ బసవన్నల విన్యాసాలను విద్యార్థులకు కొత్త అనుభూతిని కలిగించాయి. విద్యార్థులు గోదా కల్యాణం నృత్య రూపకంతో పాటు సంక్రాంతి సంబరాలకు సంబంధించిన పలు సినీ గీతాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు అతిథుల ద్వారా బహుమతులు అందజేశారు. విద్యార్థులకు ఆయా పండుగల వైశిష్ట్యం తెలిపేందుకు ఇటువంటి పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీ విద్యా సంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏలూరు రూరల్: తంగెళ్లమూడి ఎస్‌జీ సుందరమ్మ మెమోరియల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం నిర్వహించనున్నట్టు పూర్వ విద్యార్థి ఎండీ అక్రమ్ తెలిపారు. తంగెళ్లమూడి కబడ్డీగూడెం అంబేడ్కర్ బొమ్మరోడ్డు చివర బట్టల వర్తక సంఘం భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో 1984 నుంచి 89 వరకు పాఠశాలలో చదువుకున్న హైకోర్టు న్యాయవాది బి.అశోక్‌కుమార్, కానిస్టేబుల్ రేవులగడ్డ ఏసుపాదం, సయ్యద్ జిలానీ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న పీడీ రాంబాబు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తోన్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘమని డ్వామా పీడీ డి.రాంబాబు అన్నారు. స్థానిక డ్వామా కార్యాలయంలో ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా క్యాలెండర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. ఉపాధి కూలీల సమస్యలపై ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావడం ద్వారా సంఘం నాయకులు వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పీడీ రాంబాబు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన విద్యాసాగర్



సీఎం జగన్‌తో విద్యాసాగర్

ఏలూరు(మెట్రో): ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎల్.విద్యాసాగర్ కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని విద్యాసాగర్ పేర్కొన్నారు.

వందే భారత్ రైలుకు ఏలూరు హాల్ట్ కల్పించాలి

ఏలూరు(మెట్రో): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నడుపుతోన్న వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మార్గంలో ఏర్పాటుచేయడం హర్షణీయమని రాష్ట్ర ఎన్‌జీఓ నాయకులు ఆర్‌ఎస్ హరనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరులో హాల్ట్ కల్పించేలా ఎంపీ కోటగిరి శ్రీధర్ కేంద్రంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా కూడార్రై వేడుక



కూడార్రై వేడుకల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పన్నిద్రాళ్వార్లు రచించిన నాలాయిర దివ్య ప్రబంధంలో తిరుప్పావై పాశురాల్లోని 27వ పాశురాన్ని తెల్లవారుజామున పారాయణ చేశారు. గోదాదేవి వర్ణించిన ప్రకారం 27వ పాశురంలో పేర్కొన్న విధంగా పాలు, అన్నం మునిగేలా నెయ్యిపోసి ప్రత్యేక ప్రసాదం స్వామి వారికి నివేదించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ అంబారీషోపాఖ్యానం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కాకినాడ శ్రీ పీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద స్వామి అనుగ్రహభాషణం చేశారు. రాత్రి 8 గంటలకు విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పీవీఏ ప్రసాద్ బృందం భక్తి సంకీర్తన విభావరి ఏర్పాటుచేశారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంద్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

దేవదాయ షాపుల లీజులకు టెండర్ల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని దేవదాయ శాఖ పరిధిలోని అన్న, వస్త్ర, వైద్య, విద్యా దాన సమాజానికి చెందిన షాపుల లీజు నిమిత్తం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక కుండీ సెంటర్‌లో ఒక షాపు, మెయిన్ బజారులో ఒక షాపుకు లీజు హక్కులు పొందేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు తమ సమాజం కార్యాలయంలో నిర్వహించే టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ షాపులను మూడేళ్ల కాలానికి లీజు హక్కు కల్పిస్తామని, వేలంలో పాల్గొనే వారు తొలుత రూ.10 వేలు ధరావతు చెల్లించాలని తెలిపారు.

కార్మిక మహాగర్జన పోస్టర్ విడుదల



కార్మిక మహాగర్జన పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మికులు చేస్తోన్న ఆందోళనలకు మద్దతుగా ఈనెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ నెల 27న విశాఖ పట్టణంలో నిర్వహించే కార్మిక గర్జన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవటం ద్వారా బీజేపీ ప్రైవేటీకరణ విధానాలను నియంత్రించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఉక్కు పరిశ్రమ ప్రభుత్వం రంగంలోనే కొనసాగాలని కోరుతూ రెండేళ్లుగా విశాఖ ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాలు చేస్తున్నాయని వివరించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆందోళనలను పెడచెవిన పెట్టి రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం తలపెడుతోందని ఆరోపించారు. విశాఖ కార్మికులకు మద్దతుగా ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు చెపాపరు. ఈ నెల 27న విశాఖ మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమ శంకర్, కె.కృష్ణమాచార్యులు, పుప్పాల కన్నబాబు, కడుపు కన్నయ్య, పోలా భాస్కర్, గేదెల నాగేశ్వరరావు, సాయన బాలు, కనకం జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు అభినందనీయం



చెస్ ఆడుతున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్

ఏలూరు (టూటౌన్): పండుగ సమయంలో చెడు వ్యసనాలకు దూరంగా డీవైఎఫ్‌ఐ, ప్రజా సంఘాలు ప్రతి ఏటా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ అన్నారు. స్థానిక పవరుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఏలూరు జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా కొందరు కోడి పందాలు, జూదం వైపు వెళుతున్నట్లు చెప్పారు. అది సమాజానికి మంచిది కాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సంక్రాంతి అనేది ఏదో ఒక మతానికి, కులానికి చెందినది కాదన్నారు. మొత్తం ప్రజలంతా నిర్వహించుకునే పండుగ అన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చిన ఆనందంలో నుంచి ఇటువంటి పండుగలు వచ్చాయని వివరించారు. తెలుగు ప్రజలకు ప్రియమైన పండుగ సంక్రాంతి అన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో 50 కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి పి.శివశంకర్, వ్యవసాయ కార్మికక సంఘం జిల్లా కార్యదర్శి పీవీ రామకృష్ణ, విజయ్ జ్యూలర్స్ శ్రీనివాస్, చెస్ ఆర్బిటర్ డి.లక్ష్మణరావు, సహాయకులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఐ ఆదిప్రసాద్ చెస్ ప్లేయర్స్‌తో చెస్ ఆడుతూ చెస్‌లోని మెళకువలపై విద్యార్థులతో ముచ్చటించారు.

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి



లింగపాలెంలో నిర్వహిస్తున్న ప్రజావేదిక

లింగపాలెం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేయించాలని డ్వామా పీడీ డి రాంబాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం అధ్యక్షతన 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పంచాయతీరాజ్, సర్వశిక్షా అభియాన్, గ్రామీణ నీటి పారుదల తదితర శాఖల పనులను మండలంలో దాదాపు రూ.31 కోట్లతో చేసిన పనులనుపై పీడీ రాంబాబు, ఏలూరు క్లస్టర్ ఏపీడీ జి సుధాకర్ నిధుల తనిఖీ నిర్వహించారు. ప్రజావేదిక సమాచారం ఇవ్వలేదని కొందరు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీ అనంతరం ఏపీడీ సుధాకర్ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో చిన్న మస్టర్ పొరపాట్లు గుర్తించామన్నారు. పంచాయతీల్లో రోడ్లుకు ఇరువైపులా నాటిన మొక్కలు చనిపోవడంతో మళ్లీ మొక్కలు నాటాలని సిబ్బందికి ఆదేశించారు. మండల వ్యాప్తంగా రెండు సంవత్సరాలకు సంబంధించి ఉపాధి సిబ్బందికి రూ.96,076 రికవరీ చేయాలని ఏపీడీ ఆదేశించారు. రూ.18,500 ఫైన్ విధించారు. పనులు గుర్తింపుపై గ్రామ సభలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను, గ్రామస్తులను భాగస్వాములు చేయాలన్నారు. క్లస్టర్ ఏపీడీ శ్రీదేవి, డ్వామా విజిలెన్స్ అధికారిణి ఏవీ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయండి

టి.నరసాపురం: మార్చి నెలాఖరులోపు పంచాయతీల్లో నూరు శాతం పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని డీపీవో జీవీకే మల్లికార్జునరావు కార్యదర్శులను ఆదేశించారు. వుంత దారిని కొందరు ఆక్రమించారని తెడ్లం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీపీవో సదరు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని పంచాయతీల్లో 40శాతం మాత్రమే పనులు వసూలయ్యాయని తెలిపారు. వెలగపాడు పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలకు స్థలం ఇచ్చిన దాతకు ప్రత్యామ్నాయంగా స్థలం ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్‌టీ స్వామి, ఏపీవో శ్రీనివాస్, పంచయాతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10-12
బెండకాయలు	54	కంద	34
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	60
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	56
బీరకాయలు (పందిరి)	50	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	50
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30-34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	00

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	00
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	00

గృహసారథుల నియామకం



డివిజన్‌లో నియమితులైన గృహసారథులు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు గృహ సారథులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం 15 డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో గృహసారథులను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ రూ.కోట్లు వెచ్చించి పేదలకు ఇళ్ల స్థలాలు అందించారని తెలిపారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు అందిస్తున్నారని చెప్పారు. జగనన్నకాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, విద్యుత్, నీటి వసతి కల్పించారని అన్నారు. పేదలు ఇళ్లు వేగంగా కట్టుకునేందుకు సహకరించేలా ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషి చేస్తున్నారన్నారు. ఈ పథకం విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పణ

కామవరపుకోట: స్థానిక చౌతన సెంటర్‌లోని సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా 27వ రోజు కూడార్రై ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని 108 పాత్రలలో పాయసన్నము నింపి శ్రీ కృష్ణ స్వామి గోదాదేవి అమ్మవార్లకు విశేషంగా సారె, నైవేద్యం సమర్పించారు. సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీరామచంద్ర వరప్రసాద్, స్వామి అమ్మవార్ల చరిత్ర విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వరూప, మణిశ్రీ, గాయత్రీ, శారద, సత్యవతి, సుధా, పద్మిని, వాసవి, శాంతి, కళ్యాణి, రజిని, సుజాత, లక్ష్మి, అపర్ణ సారే నైవేద్యం సమర్పించిన వారిలో ఉన్నారు.

వెండితో చిన్నారికి తులాభారం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఒక చిన్నారికి బుధవారం రాత్రి వెండితో తులాభారం వేశారు. కర్నాటకలోని సిరిగుప్పకు చెందిన వక్కలగడ్డ బాబి పుండరీకాంత్, మౌనిక దంపతులు తమ నెలన్నర వయస్సుగల చిన్నారికి వెండితో తులాభారం వేయగా, 4 కేజీల బరువు తూగింది. అనంతరం వారు వెండిని స్వామివారి హుండీలో వేసి, శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు.